మెయిన్

# టీ-మీడియా

సామాజికం.. ప్రజల పక్షం...

సంపుటి : 8
సంచిక : 218
పేజీలు : 3

ఆదివారం 08.03.2026

GSTIN:36FDKPS1308P1ZX | Digital, tmedia.net.in

ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ





## తెలంగాణ మహిళలకు..

# సురక్షిత రాష్ట్రం




- సీఎం రేవంత్ రెడ్డి
- జేఎన్టీయూ ఆడిటోరియంలో 'స్టాండ్ విత్ హర్'




**టి మీడియా ,మార్చి 7 , హైదరాబాద్ బ్యూరో :**
మహిళల ప్రాధాన్యం గుర్తించి కాంగ్రెస్ పార్టీలో పదవులు ఇస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళల రక్షణ కోసం అనేక కార్యక్రమాలు చేపట్టిందన్న సీఎం మనల్ని మనం సవరించుకోవాలని అన్నారు. మహిళల రక్షణ కోసం అనేక చట్టాలు తీసుకొస్తున్నామని తెలిపారు. సోషల్ మీడియాలో మహిళలను వేధించే ఘటనలు తాజాగా పెరుగుతున్నాయన్న సీఎం వాటిని కట్టడి చేయాలని పిలుపునిచ్చారు. జేఎన్టీయూ ఆడిటోరియంలో 'స్టాండ్ విత్ హర్' కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి, డీజీపీ శివధర్‌రెడ్డి పాల్గొన్నారు.

### మహిళలను వేధించడానికి టెక్నాలజీ వాడుతున్నారు

మహిళలు ఆర్థికంగా బలపడాలనే ఆలోచనతోనే మహిళాశక్తి పథకం తీసుకువచ్చామని రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. ఆర్టీసీలో వెయ్యి బస్సులకు మహిళలే యజమానులని, తెలంగాణ రాష్ట్రంలో మహిళలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని, ప్రభుత్వానికి మహిళలపై సంపూర్ణమైన విశ్వాసం ఉందని అన్నారు. మహిళల భద్రత కోసం రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని స్పష్టం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలకు అంతర్జాతీయ గుర్తింపు లభిస్తోందని, సమాజంలో మహిళలకు ఇబ్బందులు పెరిగిపోతున్నాయని, మహిళలను వేధించడానికి టెక్నాలజీ వాడుతున్నారని తెలిపారు.

### మహిళల పేరు మీద రేషన్ కార్డులు ఇచ్చాం

మన కుటుంబ సభ్యులపై జరిగే వేధింపులను ఎలా భావిస్తామో, ఇతర మహిళల విషయంలో కూడా అదే విధంగా స్పందించాలని సీఎం కోరారు. కాలేజీలు, కార్యాలయాలు, రైల్వే స్టేషన్లు, బస్టాండ్లు, సినిమా హాళ్లు వంటి ప్రదేశాల్లో మహిళల భద్రతకు ప్రాముఖ్యత ఇవ్వాలని, మహిళలపై వేధింపులు జరిగితే నిర్లక్ష్యం చేయడం కూడా ఒక రకంగా నేరమే అని పేర్కొన్నారు. మహిళల పేరు మీద రేషన్ కార్డులు ఇచ్చామని, ఇళ్ల కేటాయింపులు మహిళల పేరుతో వస్తున్నాయని అన్నారు. లక్షలాది మహిళలకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తుందని, మహిళలు తయారు చేసే ఉత్పత్తులను ప్రపంచ మార్కెట్‌లో అమ్మే అవకాశం కల్పించామని వెల్లడించారు.తెలంగాణను మహిళలకు అత్యంత సురక్షిత రాష్ట్రం : హైటెక్ సిటీలో మహిళలకు ప్రత్యేక స్టాల్స్ ఏర్పాటు చేశామని, మహిళలు సోలార్ విద్యుత్ ఉత్పత్తి చేసి ప్రభుత్వానికి అమ్మే అవకాశం కల్పించామని సీఎం తెలిపారు. తెలంగాణలో మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించామని, పెట్రోల్ బంకులను మహిళాలను నిర్వహించే అవకాశాలు తీసుకవచ్చామని గుర్తు చేశారు. వీరనారి చాకలి ఐలమ్మ స్ఫూర్తితో రాష్ట్రానికి మహిళా యూనివర్సిటీ తీసుకువచ్చామని తెలిపారు. జిల్లాల్లో మహిళా కలెక్టర్లు, ప్రభుత్వంలో ముఖ్య పదవుల్లో మహిళలకు ప్రధాన పాత్రను కల్పించామని, తెలంగాణను మహిళలకు అత్యంత సురక్షిత రాష్ట్రంగా తీర్చిద్దామమని అన్నారు. మహిళలు చదువుకొని, ఉద్యోగాలు చేసి ఆర్థికంగా ఎదగాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నం చేస్తుందని వివరించారు.



## గణపతి లొంగిపోతే..

# రక్షణ కల్పిస్తాం

- సీఎం సమక్షంలో 130 మంది లొంగుబాటు
- 124 తుపాకులను అప్పగింత



**టి మీడియా ,మార్చి 7 , హైదరాబాద్ బ్యూరో :**
మావోయిస్టు లొంగుబాటుకు సంబంధించి కీలక పరిణామం చోటుచేసుకుంది. బంజారాహిల్స్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో 130 మంది మావోయిస్టులు ఆయుధాలతో లొంగిపోయారు. మావోయిస్టులు 124 ఆయుధాలను అప్పగించారు. లొంగిపోయిన వారిలో ముగ్గురు రాష్ట్ర కమిటీ సభ్యులు, ఒక రీజినల్ కమిటీ సభ్యుడు, పది మంది డివిజనల్ కమిటీ సభ్యులు, 46 మంది ఏరియా కమిటీ సభ్యులు, 70 మంది పార్టీ సభ్యులు ఉన్నారు. 130 మందిలో 125 మంది ఛత్తీస్‌గఢ్, 4 తెలంగాణ, ఒకరు ఆంధ్రప్రదేశ్?కు చెందినవారు ఉన్నారు. లొంగిపోయిన మావోయిస్టులు ఒక ×చీూాూ ావీ+ రైఫిల్, (31)ాూఖ-47 రైఫిళ్లు, (21) ×చీూాూ రైఫిళ్లు, (20) ాూ= రైఫిళ్లు, (18) 303 రైఫిళ్లు, 33 ఇతర తుపాకులను పోలీసులకు అప్పగించారు. డీజీపీ శివధర్ రెడ్డి, డీఐజీ

మిగతా 3లో..



# మమతపై నాకు చెలెల్లు లాంటిది

### రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

**టి మీడియా ,మార్చి 7 , ఢిల్లీ బ్యూరో :**
బంగాల్‌లోని సీఎం మమతా బెనర్జీ ప్రభుత్వంపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము బహిరంగంగా అసంతృప్తి వ్యక్తం చేశారు. సిలిగుడిలో అంతర్జాతీయ సంతాల్ ఆదివాసీ సదస్సుకు ద్రౌపది ముర్ము ముఖ్య అతిథిగా హాజరుకావాల్సి ఉంది. అయితే అక్కడ కాంక్లేవ్ నిర్వహించేందుకు అధికారులు చివరి నిమిషంలో అనుమతి రద్దు చేశారు. ప్రజలు భారీగా గుమిగూడే అవకాశం ఉందన్న భద్రతా కారణాలను చూపుతూ వేదికను డార్జిలింగ్‌కు మార్చారు. ఈ అంశంపై స్థానికుల ఎదుటే ముర్ము అసహనం వ్యక్తంచేశారు.ప్రోటోకాల్‌తో పాటు సన్నాహాల్లో తలెత్తిన లోపాలను ముర్ము ఎత్తి చూపారు. తాను రాష్ట్రానికి బంగాల్?కు వెళ్లినప్పుడు ఎయిర్‌పోర్టులో స్వాగతం పలికేందుకు సీఎం మమతా కానీ, కనీసం ఆ రాష్ట్ర మంత్రులు కానీ రాలేదని, కేవలం మేయర్ మాత్రమే వచ్చారని అన్నారు. సిలిగుడిలో అయిదు లక్షల మంది ప్రజలు తరలివచ్చినా సరిపోయేంత స్థలం ఉందని చెప్పారు. సదస్సు చప్పగా జరగాలని, ఆదివాసీలు ఎవరూ అక్కడకు రావద్దొనే ఉద్దేశంతోనే అలా చేశారని మండిపడ్డారు. మమతతో తనకు ఎలాంటి ద్వేషం లేదని, ఆమె తన చెలెల్లు లాంటిదని వ్యాఖ్యానించారు.

# ట్రంప్ హత్యకు కుట్ర

- దోషిగా పాకిస్థానీ
- ఇరాన్ ఆదేశాలతో వచ్చాడని ఆరోపణ



**టి మీడియా ,మార్చి 7 , ఢిల్లీ బ్యూరో :**
అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్?ను హత్య చేయడానికి కుట్ర పన్నిన కేసులో పాకిస్థాన్?కు చెందిన వ్యక్తిని అమెరికా కోర్టు దోషిగా తేల్చింది. ఇరాన్‌తో సంబంధాలున్న పాకిస్థానీ వ్యక్తి ఆసిఫ్ రజా మర్చంట్ (48) అమెరికా నేతలను హత్య చేయాలని ప్రయత్నించినట్లు కోర్టు నిర్ధారించింది. న్యూయార్క్‌లోని బ్రూక్లిన్ ఫెడరల్ కోర్టులో జ్యూరీ విచారణ అనంతరం ఈ తీర్పు వెలువడింది.

మిగతా 3లో..

# కమర్షియల్ సిలిండర్ల నిలిపివేత

- హోటళ్లు, రెస్టారెంట్ల పరిస్థితేంటి ..?
- రాష్ట్రంలో నెలకు 7-7.5 లక్షల రీఫిల్‌కు డిమాండ్



**టి మీడియా ,మార్చి 7 , హైదరాబాద్ బ్యూరో :**
కట్టెల పొయ్యిలో వంటలు చేసే రోజులు గుర్తున్నాయా? ఇలా వంటలు చేస్తారనే విషయం ఇప్పటి తరానికి తెలియకపోవచ్చు. అయితే ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్న యుద్ధాల కారణంగానే

మిగతా 3లో..



# అనాథలకు అమ్మలా, అండగా

## 57 ఏళ్లుగా 'వాసవ్య మహిళా మండలి' సేవలు

**టి మీడియా ,మార్చి 7 , విజయవాడ :**



సహజంగానే మహిళలు అనేక సమస్యలు ఎదుర్కొంటారు. ఇక అనాథలు, ఒంటరి మహిళలు, వృద్ధుల గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. అలాంటి వారికి అండగా నిలుస్తోంది వాసవ్య మహిళా మండలి. ఎంతోమంది అనాథ బాలికలు, వృద్ధులకు దశాబ్దాలుగా ఆశ్రయం కల్పిస్తోంది. ఇతరులపై ఆధారపడకుండా ఉండేందుకు అవసరమైన ఉపాధి నైపుణ్యాలు నేర్పిస్తూ వారిలో ఆత్మస్థైర్యం నింపుతోంది. 57ఏళ్లుగా ఎంతో మంది మహిళలకు దిక్సూచిగా మారి సాధికారత దిశగా అడుగులు వేస్తోంది. మహిళలకు అవసరమైన న్యాయ, ఆర్థిక పరమైన తోడ్పాటుని అందిస్తూ మరెన్నో సంస్థలకు ఆదర్శంగా నిలుస్తోంది. మహిళా అభ్యున్నతికి పాటుపడుతున్న ఆ మహిళా మండలి విశేషాలు ఇప్పుడు చూద్దాం.ప్రస్తుత సమాజంలో చాలా మంది మహిళలు ఏదో ఒక సమస్యతో ఇబ్బంది పడుతూనే ఉన్నారు. అందుకు చాలానే ఉదాహరణలు ఉన్నాయి. కొన్నిసార్లు కన్న వాళ్లే వారిని భారంగా భావిస్తారు. అలాంటి వారికి మేమున్నామంటూ చేరదీస్తోంది వాసవ్య మహిళా మండలి. మహిళల అభ్యున్నతి కోసం నిర్విరామంగా కృషి చేస్తోంది. ఐదున్నర దశాబ్దాల క్రితం విజయవాడలో ప్రారంభమైన ఈ సంస్థ, ఇప్పటివరకూ లక్షల మంది మహిళల జీవితాల్లో వెలుగులు నింపింది. మారుతున్న కాలానికి అనుగుణంగా మహిళలకు ఆధునిక పద్ధతుల్లో పలు రంగాల్లో శిక్షణ ఇస్తూ, భవిష్యత్తుకు బాసటగా నిలుస్తోంది. ఆర్థికంగా, మానసికంగా, సామాజికంగా అన్నివిధాల నిలదొక్కుకునేలా తోడ్పాటు అందిస్తోంది. ఆరోగ్యం, పోషకాహారం, విద్య, జీవనోపాధి సహా తదితర అంశాల్లో వారికి ఊతం అందిస్తోంది.

**9 జిల్లాల్లో సేవలు**

1969లో మాజీ ఎంపీ చెన్నుపాటి విద్య వాసవ్య మహిళా మండలిని స్థాపించారు. నాటి నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఒంటరి మహిళలు, గృహిణులు, యువతులు, బాలికలకు అండగా నిలుస్తోందీ సంస్థ. అవసరం, పరిస్థితిని బట్టి అనువైన అంశాల్లో ఇక్కడ శిక్షణ ఇస్తోంది. బాల్య వివాహాలు అడ్డుకుని, బాలికా విద్యను ప్రోత్సహిస్తున్నారు సంస్థ సభ్యులు. అల్లూరి సీతారామరాజు, విశాఖ, ఎన్టీఆర్, కృష్ణా, సత్యసాయి, కర్నూలు, కాకినాడ, గుంటూరు, ఒంగోలు జిల్లాల్లో వాసవ్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అమ్మాయిలను చదివించడమే కాకుండా, కొందరిని ఎంపిక చేసి బాల పంచాయతీలను నిర్వహిస్తున్నారు. వాళ్ల ద్వారానే బాలికా విద్య, బాల్యవివాహాలపై అవగాహన కల్పిస్తున్నారు. ట్రాన్సిషన్ లెర్నింగ్ సెంటర్ల ద్వారా చదువు మధ్యలోనే ఆపేసిన వారికి తగిన శిక్షణనిచ్చి తిరిగి బడిబాట పట్టిస్తున్నారు. ఊరు నుంచి దూరం వెళ్లే విద్యార్థులకి సైకిల్ అందిస్తున్నారు. అంతేకాదు, ఆత్మరక్షణ విద్యల్లోనూ బాలికలకు తర్ఫీదు ఇస్తున్నారు.మహిళలు ఆర్థికంగా ఎదగాలనే ఉద్దేశంతో వాసవ్య మహిళా మండలి ద్వారా ఉపాధి నైపుణ్యాలలో శిక్షణ ఇస్తున్నాం. ఎవరైనా గ్రాంట్?లు ఇస్తే వాటి ద్వారా రుణాలు, కుట్టు మిషన్లు, బడ్డీ కొట్టు పెట్టుకోడానికి సహకారం అందిస్తున్నాం. సరికొత్తగా ఏఐ టూల్స్ ఉపయోగించి వ్యాపారాలను ఎలా వృద్ధిలోకి తీసుకురావాలో శిక్షణ ఇస్తున్నాం. సుమారు 200 మందిని మహిళా పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దడంలో ముందడుగులో ఉన్నాం." – డాక్టర్ బొల్లినేని కీర్తి, వాసవ్య మహిళా మండలి అధ్యక్షురాలు

**అనాథ పిల్లలను చేరదీసి ఆశ్రయం**


ముఖ్యంగా తల్లిదండ్రులు లేని పిల్లలను చేరదీసి ఆశ్రయం కల్పిస్తోంది వాసవ్య మహిళా మండలి. ఉన్నతంగా చదువుకునేలా ఏర్పాటు చేస్తోంది. చదువు పూర్తి చేసుకున్న వారికి సంస్థ పరిధిలోనే ఉద్యోగ అవకాశాలు కల్పిస్తోంది. అలాగే, కృష్ణాజిల్లా గోశాలలో 2 వేల సంవత్సరంలో వృద్ధాశ్రమం ఏర్పాటు చేశారు. ప్రస్తుతం అక్కడ 40 మంది ఆశ్రయం పొందుతున్నారు. వారి ఆలనా పాలన అంతా వాసవ్య మహిళా మండలే చూస్తోంది. విజయవాడలోని కానూరులో పట్టణ బాలికల వసతి గృహాన్ని నిర్వహిస్తోంది. ఇలా గత 25 ఏళ్లుగా ఎంతో మంది అనాథ బాలికలను గుర్తించి వారికి అవసరమైన అన్ని రకాల వసతులు కల్పిస్తోంది వాసవ్య మండలి.సంస్థ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని వివిధ జిల్లాలో అనేకమంది మహిళలకు ఉపయోగపడే కార్యక్రమాలు ఎన్నో నిర్వహిస్తున్నారు. గిరిజన గ్రామాల్లో మహిళలకు చదువు నేర్పించడం వంటివి చేస్తున్నారు. ఆడవారికి ప్రత్యేకంగా వృత్తి, విద్యా కోర్సుల్లో తర్ఫీదు ఇస్తూ సర్టిఫికేషన్ కోర్సులు అందిస్తున్నారు. ఇటీవలి కాలంలో సౌర విద్యుత్ ప్రాధాన్యం పెరుగుతుండటంతో ఆ రంగంలో మహిళల్ని నిపుణులుగా తీర్చిదిద్దుతున్నారు. సోలార్ ప్యానెల్స్ బిగించడం, వాటి నిర్వహణ వంటి అంశాల్లోనూ శిక్షణ ఇస్తున్నారు. అవసరమైన టూల్ కిట్‌లు ఉచితంగా అందజేయడమే కాకుండా ఉద్యోగావకాశాలూ కల్పిస్తున్నారు. అవసరమైతే రుణాలు ఇప్పిస్తున్నారు. ఇప్పటివరకూ 500 మందిని సోలార్ పీవీ టెక్నీషియన్లుగా తీర్చిదిద్దారు.

**ఏఐ, ఫైనాన్షియల్ మేనేజ్‌మెంటుల్లో ట్రైనింగ్**

ట్యాలీ, జీఎస్‌టీ, సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్ ఇలా ఆధునిక అంశాలన్నింటినీ అందుబాటులోకి తెస్తున్నారు. వ్యాపారాలు చేసుకుంటున్న స్వయం సహాయక సంఘాల మహిళలకు ఏఐ, ఫైనాన్షియల్ మేనేజ్‌మెంటుల్లో ట్రైనింగ్ ఇస్తున్నారు. వ్యాపారాలు ప్రారంభించాలనుకునేవారికి మార్కెట్ నైపుణ్యాలతోపాటు ఆర్థిక నిర్వహణపైనా అవగాహన కల్పిస్తున్నారు. ఆన్‌లైన్ మోసాల బారిన పడకుండా అవగాహన కల్పిస్తున్నారు. ప్రతి గ్రామంలో ఇద్దరు టైలరింగ్ వచ్చిన మహిళలను ఎంపిక చేసి టైలరింగ్ మెషీన్ మెకానిజంపై శిక్షణ ఇస్తున్నారు. ఇప్పటి వరకు 12వేల మంది మహిళలకు కుట్టు మిషన్ నేర్పించారు. పేద మహిళలకు పలు సంస్థల సహకారంతో ఉచితంగా కుట్టుమిషన్లు అందజేస్తున్నారు. అలాగే, బ్యూటీషియన్, ఫ్యాషన్ డిజైనింగ్ వంటివి నేర్పిస్తున్నారు. బ్యూటీషన్ కోర్సులో ఇప్పటి వరకు సుమారు 2వేల మంది శిక్షణ పొందారు. టాలీ, జీఎస్టీ కోర్సుల్లో 11వందల మంది ట్రైనింగ్ తీసుకున్నారు. ఇలా చాలా రకాల వృత్తి నైపుణ్యాలు నేర్పిస్తూ, మహిళల సాధికారత దిశగా ప్రోత్సహిస్తున్నారు.

**సాయం కోరిన వారికి అండగా**

అతివలు ఆర్థికంగా నిలదొక్కుకునేలా చేయడమే కాదు, సాయం కోరి ఆశ్రయించిన వాళ్లకి వాసవ్య అండగా నిలుస్తోంది. భార్యాభర్తల గొడవలు, తల్లిదండ్రులు చనిపోయి ఒంటరిగా మిగిలిన యువతులు, పిల్లలు పట్టించుకోని వృద్ధులు వంటివారిని చేరదీస్తున్నారు. ఫ్యామిలీ కౌన్సిలింగ్ సెంటర్ ద్వారా మహిళలకు న్యాయ సహాయం అందిస్తున్నారు. కుటుంబ కలహాలు, వరకట్న వేధింపులు, గృహహింస, ప్రేమ పేరుతో యువతులను మోసం చేసే అనేక సమస్యలకు పరిష్కారం చూపిస్తున్నారు. రోజూ నలుగురు నుంచి 10 మంది వరకు ఇక్కడికి వచ్చి న్యాయ సాయం పొందుతున్నారు. కౌన్సిలింగ్‌లో భాగంగా పోలీసుల సహకారం తీసుకుంటున్నారు. పోలీసులు సైతం కౌన్సిలింగ్ కోసం ఇక్కడకు పంపిస్తుండటం గమనార్హం. అనేక సంస్థలు, వ్యక్తులు తమకు ఆర్థిక తోడ్పాటుని అందిస్తున్నట్లు వాసవ్య మహిళా మండలి అధ్యక్షురాలు కీర్తి చెబుతున్నారు. ఆ నిధులతో మహిళలకు అవసరమైన వివిధ రకాల సేవా కార్యక్రమాలు, శిక్షణలు అందిస్తున్నామని అంటున్నారు.



## సమాజంలో స్త్రీపాత్ర విశిష్టమైనది

**టీ మీడియా, మార్చి 7, వనపర్తి బ్యూరో :**

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మాజీ మంత్రి శినివారం మహిళా కౌన్సిలర్లను సన్మానించి అభినందించారు.ఈ సందర్భంగా నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ సమాజంలో మహిళల పాత్ర చాలా విశిష్టమైంది అని అన్నారు.కుటుంబ అభివృద్ధి లాగానే తమకు అందివచ్చిన అవకాశాలను ఉపయోగించుకొని మహిళలు తమ ప్రతిభ చాటుకుంటున్నారని అన్నారు. అటువంటి మహిళలను గౌరవించడం మన సంస్కారాన్ని పెంచుతుందని అభిప్రాయపడ్డారు. అన్ని రంగాలలో మహిళలను ప్రోత్సహించడం మన బాధ్యతగా తీసుకోవాలని కోరారు. సన్మానం పొందిన మహిళా కౌన్సిలర్స్ లో భారతి ప్రేమ్ నాథ్ రెడ్డి,స్వాతి హరిబాబు,ఏర్వ.అరుణ శ్రీనివాసులు,శిరీష రమేష్ గౌడ్,శంకరమ్మ బాబు నాయక్,అయేషా సిద్ధిఖీ, మహిళా అధ్యక్షురాలు నాగమ్మ,జ్యోతి రమణ ,నాయకులు గట్టు యాదవ్ వాకిటి శ్రీధర్,నందిమల్ల.అశోక్, విజయ్ కుమార్, గంధం. పరంజ్యోతి,కౌన్సిలర్స్ మురళీ సాగర్,శ్రీకర్ గౌడ్,మదన్,మహేశ్వర్ రెడ్డి,వెంకట్ సాగర్, మంద.రాము,హర్షద్,మహేష్ తదితరులు ఉన్నారు.

## రేషన్ బియ్యం పోలీసుల దాడి

**టీ మీడియా , మార్చి 7 ,నర్వ**



నారాయణ పేట జిల్లా నర్వ మండల పరిధిలోని యంకి గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచిన పి.డి.ఎస్ (రేషన్) బియ్యాన్ని శనివారం స్వాధీనం చేసుకున్నట్లు నర్వ సబ్ ఇన్‌స్పెక్టర్ పబ్బతి రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు.కేసు వివరాలమేరకు నర్వ ఎస్.హెచ్.ఓ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది యంకి గ్రామంలో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో గ్రామానికి చెందిన ఎరుకలి శ్రీనివాసులు తన నివాసంలో అక్రమంగా నిల్వ ఉంచిన 19 బస్తాల (సుమారు 5.80 క్వింటాళ్లు) రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. స్వాధీనం చేసుకున్న బియ్యం విలువ సుమారు రూ. 14,500/- ఉంటుందని అధికారులు ధృవీకరించారు. నిందితుడు చుట్టుపక్కల గ్రామాల ప్రజల నుండి తక్కువ ధరకు బియ్యాన్ని సేకరించి, ఇక్కడ అక్రమంగా నిల్వ చేసినట్లు విచారణలో తేలింది. పంచాయతీదారుల సమక్షంలో పంచనామా నిర్వహించి బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్.ఐ తెలిపారు.నర్వ మండల ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ ఎ. నాగరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితుడిపై చట్టపరమైన చర్యలు ప్రారంభించామని ఎస్.ఐ పబ్బతి రమేష్ పేర్కొన్నారు. ప్రభుత్వ బియ్యాన్ని అక్రమంగా తరలించినా లేదా విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ ఇ హెచ్చరించారు.

## ఉప సర్పంచ్ కు వాహనం అందజేత

- డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి

**టీ మీడియా, మార్చి 7, వనపర్తి బ్యూరో :**



వనపర్తి జిల్లా కలెక్టర్ కార్యాలయం నందు పెద్దగూడెం ఉప సర్పంచ్ భారతయ్యకు రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి చేతుల మీదుగా దివ్యాంగుల వాహనం అందజేశారు.చిన్నారెడ్డి మాట్లాడుతూ భారతయ్య తనకు దివ్యాంగుల వాహనం ఇప్పించాలని విన్నవించగా సంబంధిత అధికారికి వివరాలు తెలపగాదివ్యాంగుల వెల్ఫేర్ ద్వారా భారతయ్య కు దివ్యాంగుల వాహనం మంజూరు చేశారని తెలిపారు. ప్రజా ప్రభుత్వం దివ్యాంగులను హక్కున చేర్చుకుంటూ అండగా నిలబడుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో టిపిసిసి ప్రధాన కార్యదర్శి నందిమల్ల యాదయ్య, వనపర్తి పట్టణ ప్రధాన కార్యదర్శి బాబా, ఎత్తం చరణ్ రాజ్, పెద్దగూడెం కాంగ్రెస్ నాయకులు కొండన్న, బాల్ రాజు, బొట్టు శీను, ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.




## అంతర్జాతీయ మహిళా దినోత్సవం

- ప్రిన్సిపాల్ బి. ఈశ్వరయ్య

**టీ మీడియా, మార్చి 7, వనపర్తి బ్యూరో :**

ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల వనపర్తి క్యాంపస్ లో ఎన్ఎస్ఎస్, డబ్ల్యుఈసి ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరుపుకోవడం జరిగింది. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ బి. ఈశ్వరయ్య అధ్యక్షత వహించారు. మాట్లాడుతూ స్త్రీలు అనేక రంగాల్లో ముందుండాలి అని స్త్రీ సాధికారత సాధించేందుకు చదువే ప్రధాన ఆయుధమని స్త్రీలు అన్ని రంగాలలో పురుషులతో సమానమైన హక్కులను పొందాలని వారు సూచించారు . చదువు ద్వారానే తమ భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకునే అవకాశం ఉందని, సమాజంలో నెలకొన్న అనేకమైన సామాజిక అంతరాలకు చదువే చక్కని పరిష్కారం అందిస్తుందని సూచించారు. కళాశాల మహిళలందరిని, మెమెంటోతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ పోతురాజు శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్ రామరాజు యాదవ్ , అకాడమిక్ కోఆర్డినేటర్ కే దామోదర్ రెడ్డి, మంజుల, విష్ణుమూర్తి, డాక్టర్ ఎల్. పుష్ప, స్రవంతి, విజయలక్ష్మి, దౌలమ్మ, స్వాతి, మొదలగు లెక్చరర్స్ తో పాటు విద్యార్థులు పాల్గొనడం జరిగింది.

# షూ వేసుకురాలేదని విద్యార్థుల మెడలో చెప్పుల దండ

**టి మీడియా ,మార్చి 7 , పెనమలూరు :**



విద్యా బుద్ధులు నేర్పించి వారిని ఉన్నత పౌరులుగా తీర్చిదిద్దాల్సిన అధ్యాపకులు దిగజారి ప్రవర్తించారు. విద్యార్థులు పాఠశాలకు బూట్లు వేసుకురాలేదని ఆగ్రహంతో ఊగిపోయిన అధ్యాపకులు విద్యార్థులు వేసుకు వచ్చిన చెప్పులను దండగా చేసి వారి మెడలోనే వేసి అత్యంత అమానుషంగా ప్రవర్తించారు. ఈ ఘటన కృష్ణా జిల్లాలో చోటు చేసుకుంది.అసలేం జరిగిందంటే? కృష్ణాజిల్లా పెనమలూరు నియోజకవర్గం ఉయ్యూరులోని ఓ ప్రైవేటు పాఠశాల్లో దారుణం చోటు చేసుకుంది. విద్యార్థులు పాఠశాలకు బూట్లు వేసుకు రాలేదని విద్యార్థులు వేసుకువచ్చిన చెప్పులను దండగా చేసి వారి మెడలో వేసుకోవాలని పాఠశాల యాజమాన్యం వారికి దండన విధించింది. ప్రైవేటు పాఠశాలకు 10 మంది విద్యార్థులు శుక్రవారం బూట్లు వేసుకురాలేదు.దాంతో ఆ విద్యార్థులు క్రమశిక్షణ పాటించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేసిన స్కూల్ యాజమాన్యం విద్యార్థుల మేడలో చెప్పుల దండ వేసి అందరి ముందు అగౌరవపరచి నిలబెట్టారు. విద్యార్థులు ఇంటికి వెళ్లి జరిగిన సంగతిని తల్లిదండ్రులకు చెప్పడంతో పాఠశాల తీరుపై వారు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దాంతో ఫలితంగా సదరు పాఠశాలలో చెప్పుల దండ వివాదంపై విద్యాశాఖ అధికారులు విచారణ చేపట్టారు.

**10 మంది విద్యార్థులకు చెప్పుల దండ**

అంతేకాకుండా ఉయ్యూరు డివిజన్ ఉప విద్యాశాఖ అధికారి పద్మారాణి స్కూల్ ప్రిన్సిపాల్, డైరెక్టర్?ను విచారిస్తున్నారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ చేస్తున్నామని, పూర్తి వివరాలను జిల్లా విద్యాశాఖ అధికారికి అందిస్తామని పద్మారాణి ఈ సందర్భంగా తెలిపారు. తమతో పాటు 10 మంది చెప్పులు దండ వేశారని విద్యార్థులు వాపోతున్నారు. దీనిపై తల్లిదండ్రులు తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారు.ఘటనపై ఉపాధ్యాయులను ప్రశ్నించగా పిల్లలకు క్రమశిక్షణ అలవడాలనే ఉద్దేశంతోనే అలా చేశామని వారు చెప్పుకొస్తున్నారు. కానీ దీనికి సంబంధించిన విషయాలు విద్యాశాఖ అధికారుల విచారణ అనంతరం పూర్తిగా తెలిసే అవకాశాలు ఉన్నాయి. విద్యార్థులకు ఇటువంటి చెప్పుల దండను వేస్తే మా పిల్లలు అవమాన భారంతో ఏమైనా అఘాయిత్యానికి పాల్పడితే ఎవరు బాధ్యత వహిస్తారని స్కూల్?కు వచ్చిన తల్లిదండ్రులు అధ్యాపకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

**ఏ దురుద్దేశం లేదంటున్న అధ్యాపకులు**

దానికి బదులిస్తూ విద్యార్థులకు బూట్లు ఉన్నప్పటికీ వాటిని వేసుకోకుండానే పాఠశాలకు వస్తున్నారు, అందుకే వారికి బుద్ధి వచ్చే విధంగా ఇలా చేశామని ఉపాధ్యాయులు తెలిపారు. మళ్లీ ఈ విధంగా ప్రవర్తించకుండా ఉండాలనే సదుద్దేశంతోనే ఈ దండనను విధించామే తప్ప, ఇందులో ఎటువంటి దురుద్దేశమూ లేదని మరో అధ్యాపకురాలు వెల్లడించింది.

**ఆగ్రహం వ్యక్తం చేసిన కరస్పాండెంట్**

దాంతో పాటు అధ్యాపకులు ఈ విధంగా విద్యార్థులకు చెప్పుల దండన విధించడంపై పాఠశాల కరస్పాండెంట్ ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులకు క్రమశిక్షణ తప్పితే సరైన దారిలో తీసుకుని వచ్చేందుకు నాలుగు మంచి మాటలను చెప్పుకుని దారిలోకి తీసుకురావాలని హితవు పలికారు. అంతేకానీ చిన్నపిల్లలపై ఇంత కఠినంగా ప్రవర్తించడమేంటని తీవ్ర స్థాయిలో అధ్యాపకులందరిపై ఆగ్రహం వ్యక్తం చేశారు.



## కల్తీ అల్లం వెల్లుల్లి పేస్ట్ ముఠా

- నలుగురు అరెస్ట్

**టి మీడియా ,మార్చి 7 , హైదరాబాద్:**

లాలాగూడ పోలీసులతో కలిసి సికింద్రాబాద్ జోన్ కమిషనర్ టాస్క్ ఫోర్స్ లాలాపేటలోని ఒక గోడౌన్‌లో నిర్వహించిన దాడిలో కల్తీ, అపరిశుభ్రమైన అల్లం-వెల్లుల్లి పేస్ట్ తయారు చేస్తున్న నలుగురు వ్యక్తులను అరెస్టు చేశారు. నిందితులను లాలాపేటలోని జనప్రియ అపార్ట్‌మెంట్స్ సమీపంలోని ఝాన్సీ అల్లం, వెల్లుల్లి పేస్ట్ గోడౌన్ యజమాని నీలా వెంకటేశ్వరలు (56), సూపర్‌వైజర్ కె. వినోద్ (46), కార్మికులు టి. సతీష్ (23), ఎం. శివాని (46)గా గుర్తించారు.లాల్లగూడ పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నంబర్ 84/2026లో భారతీయ న్యాయ సంహిత సెక్షన్లు 318(4), 275, 223 తో కలిపి 3(5) కింద కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు, టాస్క్ ఫోర్స్ బృందం ఆ ప్రాంగణంపై దాడి చేసి, నిందితులు అత్యంత అపరిశుభ్రమైన పరిస్థితుల్లో అల్లం-వెల్లుల్లి పేస్ట్ తయారు చేస్తున్నట్లు గుర్తించారు. ఈ దాడిలో, పోలీసులు 1,915 కిలోల అల్లం-వెల్లుల్లి పేస్ట్, ఎసిటిక్ యాసిడ్, శాంతన్ గమ్, ముడి అల్, వెల్లుల్లి, ప్లాస్టిక్ టబ్‌లు, ప్యాకింగ్ మెటీరియల్స్, తేదీ స్టాంపులు, లేబుల్స్, గ్రైండింగ్, తూకం, ప్యాకేజింగ్ కోసం ఉపయోగించే యంత్రాలను స్వాధీనం చేసుకున్నారు.అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, నిందితులు అల్లం, వెల్లుల్లి పేస్ట్‌తో ఎసిటిక్ యాసిడ్ వంటి రసాయనాలను కలిపి, ఆ మిశ్రమాన్ని ప్లాస్టిక్ టబ్‌లలో చాలా రోజుల పాటు నిల్వ చేశారని, ఆ తర్వాత ఈ పేస్ట్‌ను వివిధ పరిమాణాల కంటైనర్లలో ప్యాక్ చేసి, నకిలీ బ్రాండ్ పేర్లతో లేబుల్ చేసి, స్థానిక కిరాణా దుకాణాలకు సరఫరా చేసి అక్రమ లాభాలు ఆర్జించారు. తదుపరి దర్యాప్తు జరుగుతోందని టాస్క్ ఫోర్స్ అదనపు డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ అందె శ్రీనివాస్ రావు తెలిపారు.




## మనదేశంలోనె మహిళలకు గౌరవం

- డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి

**టీ మీడియా, మార్చి 7, వనపర్తి బ్యూరో :**

వనపర్తి పట్టణం ఎస్డిఎం లా కాలేజ్ ప్రిన్సిపల్ భాస్కర్ ఆహ్వాన మేరకు జాతీయ మహిళ దినోత్సవ వేడుకకు ముఖ్యఅతిథిగా రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి పాల్గొన్నారు. మాట్లాడుతూభారత దేశ స్వాతంత్ర ఉద్యమంలో ఝాన్సీ లక్ష్మీబాయి వీరోచిత పోరాటాన్ని ఆదర్శంగా తీసుతమ లోకొని నేటి మహిళలు హక్కుల కోసం పోరాడాలని అన్నారు. భూ ప్రపంచంలో మాతృ దేవోభవ అని మొదటి స్థానం మహిళ కే గౌరవం ఇవ్వడం జరిగిందని అన్నారు. మహిళా లేకపోతే మానవ జన్మనే లేదని అన్నారు.వనపర్తి పట్టణంలో ఉన్న ఐదు కోర్టులలో ముగ్గురు మహిళా జడ్జిలే ఉన్నారని భవిష్యత్తులో మీరు కూడా జడ్జిలుగా ఎదగాలని అన్నారు.లా కాలేజీలో చదువుకుంటున్న మీరు రాజ్యాంగంలో ఉన్న చట్టాలను గౌరవించుకుంటూ మహిళలకు అన్యాయం జరిగిన మీరు న్యాయం చేయాలని కోరారు. లా కోర్స్ పూర్తి చేసి ఉన్నత స్థానాలు స్థిరపడి వనపర్తి పట్టణానికి గుర్తింపు తేవాలని సూచించారు.లా కాలేజ్ మహిళ విద్యార్థులను చిన్నారెడ్డి శాలువాలు కప్పి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి ప్రధాన కార్యదర్శి నందిమల్ల యాదయ్య, వనపర్తి పట్టణ ప్రధాన కార్యదర్శి బాబా, సోషల్ మీడియా కోఆర్డినేటర్ గట్టు రాజు,ఎస్డిఎం కాలేజ్ ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.




## అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు

**టి మీడియా,మార్చి7, ఎండపల్లి:**

మండల కేంద్రంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ముందస్తుగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను శనివారం నిర్వహించారు. పాఠశాలప్రధానోపాధ్యాయులు దాశెట్టి రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మహిళా సాధికారత,సామాజిక అభివృద్ధిలో వారి పాత్రపై ప్రత్యేక చర్చా కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు రవీందర్ రెడ్డి మాట్లాడుతూ.. గతంలో మహిళలు ఎదుర్కొన్న సామాజిక కట్టుబాట్లు, శ్రామిక దోపిడీ,వివక్ష, భ్రూణహత్యల వంటి చీకటి కోణాలను వివరించారు.కాలంతో పాటు వచ్చిన మార్పుల వల్ల నేడు మహిళలు విద్య,వైద్య,పారిశ్రామిక రంగాలతో పాటు సైనిక, రాజకీయ రంగాల్లోనూ అద్భుతమైన ప్రతిభ కనబరుస్తున్నారని కొనియాడారు.ముఖ్యంగా స్వశక్తి మహిళా సంఘాల ద్వారా ఆర్థికంగా ఎదిగి, సమాజాభివృద్ధిలో కీలక భాగస్వాములు అవుతున్నారని రవీందర్ రెడ్డి పేర్కొన్నారు.ఈ వేడుకల్లో భాగంగా గ్రామాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న ప్రజా ప్రతినిధులను,మహిళా సిబ్బందిని పాఠశాల తరపున గ్రామ సర్పంచ్ మారం సునీత -జెలందర్ రెడ్డి,ఉప సర్పంచ్ కళ్యాణి, వార్డు సభ్యులకు పాఠశాలఉపాధ్యాయినీలు రాజోజి శ్రీదేవి,సింహరాజు పుష్పలత,సి.ఆర్.పి రాజరాణిలను సన్మానించారు.సేవానిరతిని చాటుతున్న మధ్యాహ్న భోజన వంట ఏజెన్సీ సభ్యులు బొంగాని నాగరాణి, దేవమ్మ, స్కావెంజర్ నీలమ్మ, గ్రామ పారిశుద్ధ్య కార్మికులను సన్మానించి వారిసేవలనుఅభినందించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు మొగురం శ్రీధర్,పర్శ రాజశేఖర్,సుబ్బని తిరుపతి,ఆఫీస్ సబార్డినేట్ గరిగే గణేష్ , విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## పరిశుభ్రతపై పోలీసుల సామాజిక చైతన్యం


**టీ మీడియా ,మార్చి 7, టేక్మాల్ ప్రతినిధి:**




మెదక్ జిల్లా టేక్మాల్ మండలంలోని పోలీస్ స్టేషన్ లో పరిసరాల పరిశుభ్రత కేవలం నినాదాలకే పరిమితం కాకుండా, ఆచరణలో చూపాలని టేక్మాల్ పోలీస్ సిబ్బంది నిరూపించారు. శనివారం స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో 'శ్రమదానం' కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. విధి నిర్వహణలో నిరంతరం బిజీగా ఉండే పోలీసులు, సామాజిక బాధ్యతతో తమ కార్యాలయ ప్రాంగణాన్ని శుభ్రం చేసుకోవడం విశేషం. స్టేషన్ ఆవరణలో పేరుకుపోయిన పిచ్చి మొక్కలు, చెత్తాచెదారం తీసివేశారు.ప్రజలకు రక్షణ కల్పించడమే కాకుండా, సమాజానికి ఆదర్శంగా నిలవడం మా బాధ్యత. కార్యాలయ ప్రాంగణం శుభ్రంగా ఉంటేనే వచ్చే ప్రజలకు కూడా ఆహ్లాదకరంగా ఉంటుంది. ఆరోగ్యకరమైన వాతావరణంలో విధులు నిర్వహించడం వల్ల మానసిక ప్రశాంతత లభిస్తుందని వారు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఎస్.ఐ తో పాటు, ఏఎస్ఐలు, కానిస్టేబుళ్లు, హోంగార్డులు , స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## బీర్ బాటిల్‌లో చేపపిల్ల స్విమ్మింగ్

**టి మీడియా ,మార్చి 7 , హైదరాబాద్ బ్యూరో :**



బీర్ తాగేందుకు వెళ్లిన ఓ వ్యక్తికి ఊహించని షాక్ తగిలింది. బీర్ బాటిల్‌లో ఓ చేపపిల్ల ఈదుతూ కనిపించింది. హైదరాబాద్ నాచారంపరిధిలోని మల్లాపూర్‌లో ఈఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మల్లాపూర్‌లోని జేపీ వైన్ షాపులో ఓ వ్యక్తి శుక్రవారం నాడు కింగ్‌ఫిషర్ లైట్ బీర్ కొనుగోలు చేశాడు. దాన్ని తాగేందుకు మూత ఓపెన్ చేయగానే అందులో చేప పిల్ల కదులుతూ కనిపించింది. దీంతో ఒక్కసారిగా అవాక్కయిన కస్టమర్.. వెంటనే షాపు నిర్వాహకుడిని ప్రశ్నించాడు. అయితే అతనితో వైన్ షాపు నిర్వాహకులు దురుసుగా ప్రవర్తించారు. బీర్లు తాము తయారుచేయమని.. ఏదైనా ఉంటే తయారుచేసిన కంపెనీని అడుక్కోవాలని నిర్లక్ష్యంగా సమాధానమిచ్చాడు.

# ట్రంప్ హత్యకు కుట్ర

- దోషిగా పాకిస్థానీ
- ఇరాన్ ఆదేశాలతో వచ్చాడని ఆరోపణ

**టి మీడియా ,మార్చి 7 , ఢిల్లీ బ్యూరో :**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్?ను హత్య చేయడానికి కుట్ర పన్నిన కేసులో పాకిస్థాన్?కు చెందిన వ్యక్తిని అమెరికా కోర్టు దోషిగా తేల్చింది. ఇరాన్‌తో సంబంధాలున్న పాకిస్థానీ వ్యక్తి ఆసిఫ్ రజా మర్చంట్ (48) అమెరికా నేతలను హత్య చేయాలని ప్రయత్నించినట్లు కోర్టు నిర్ధారించింది. న్యూయార్క్‌లోని బ్రూక్లిన్ ఫెడరల్ కోర్టులో జ్యూరీ విచారణ అనంతరం ఈ తీర్పు వెలువడింది.

అమెరికా న్యాయశాఖ తెలిపిన వివరాల ప్రకారం, ఆసిఫ్ రజా మర్చంట్ ఇరాన్‌కు చెందిన IRGC అనే సాయుధ విభాగంతో సంబంధాలు కలిగి ఉన్నాడు. అమెరికా చర్యలకు ప్రతీకారం తీర్చుకునే ఉద్దేశంతో అమెరికా నాయకులను హత్య చేయాలని అతనికి ఆదేశాలు ఇచ్చినట్లు విచారణలో వెల్లడైంది. 2020లో అమెరికా దాడిలో మరణించిన ఇరాన్ కుద్స్ ఫోర్స్ కమాండర్ కస్సేమ్ సోలైమని హత్యకు ప్రతీకారంగా ఈ కుట్ర పన్నినట్లు అధికారులు తెలిపారు. ఆ సమయంలో అమెరికా అధ్యక్షుడిగా ఉన్న డొనాల్డ్ ట్రంప్? ఆపరేషన్‌కు ఆదేశాలు ఇచ్చిన విషయం తెలిసిందే.

**అమెరికాకు వచ్చి కుట్ర పన్నిన నిందితుడు**

కోర్టులో సమర్పించిన ఆధారాల ప్రకారం ఆసిఫ్ రజా మర్చంట్ 2024 ఏప్రిల్‌లో అమెరికాకు వచ్చాడు. అతనికి అప్పట్లో ఒక ప్రత్యేక మిషన్ అప్పగించబడింది. అమెరికాలోని రాజకీయ నాయకులను హత్య చేయడానికి కాంట్రాక్ట్ కిల్లర్లను నియమించడం అతడి బాధ్యతగా ఇచ్చారు. విచారణలో మర్చంట్ వెల్లడించిన వివరాల ప్రకారం, మొదటగా హత్య చేయాల్సిన వ్యక్తి పేరును స్పష్టంగా చెప్పలేదని తెలిపాడు. అయితే తరువాత మూడు పేర్లు చెప్పారని పేర్కొన్నాడు. ఆ జాబితాలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, మాజీ అధ్యక్షుడు జో బైడెన్, ఐక్యరాజ్యసమితిలో అమెరికా మాజీ రాయబారి నిక్కీ హెలీ పేర్లు ఉన్నట్లు కోర్టులో వెల్లడించాడు. మర్చంట్ తనపై ఇరాన్ ఇంటెలిజెన్స్ అధికారులు ఒత్తిడి తెచ్చారని కూడా చెప్పాడు. తన కుటుంబ సభ్యులను బెదిరించడంతో ఈ కుట్రలో పాల్గొనాల్సి వచ్చిందని జ్యూరీకి వివరించాడు. "నా కుటుంబాన్ని బెదిరించారు. నాకు మరో మార్గం లేదు" అని కోర్టులో పేర్కొన్నాడు.



**అండర్‌కవర్ అధికారులతో సమావేశం**

న్యూయార్క్‌లో మర్చంట్ తన పరిచయ వ్యక్తిని సంప్రదించి హత్య చేయగల వ్యక్తులను ఏర్పాటు చేయాలని కోరాడు. అయితే ఆ వ్యక్తి వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చాడు. అనంతరం అతను అమెరికా దర్యాప్తు సంస్థలకు సహకరించే గోప్య సమాచార వనరుగా మారాడు. అతని సహాయంతో మర్చంట్ ఇద్దరు కాంట్రాక్ట్ కిల్లర్లను కలిసినట్లు భావించాడు. కానీ వారు నిజానికి అమెరికా చట్ట అమలు సంస్థలకు చెందిన అండర్‌కవర్ అధికారులు. జూన్ 2024లో జరిగిన సమావేశంలో మర్చంట్ హత్య ప్రణాళికను వివరించాడు. అమెరికాలో రాజకీయ సభలు ఎక్కడ జరుగుతున్నాయి, భద్రత ఎలా ఉంటుంది అనే అంశాలపై కూడా పరిశోధన చేసినట్లు వెల్లడైంది. తర్వాత జూన్ 21న న్యూయార్క్‌లో జరిగిన మరో సమావేశంలో మర్చంట్ ఆ ఇద్దరు అండర్‌కవర్ అధికారులకు 5 వేల డాలర్లు అడ్వాన్స్‌గా ఇచ్చాడు. హత్యను తన అమెరికా ప్రయాణం ముగిసిన తర్వాత అమలు చేయాలని, విదేశాల నుంచి కోడ్ పదాలతో సూచనలు ఇస్తానని చెప్పినట్లు కోర్టులో పేర్కొన్నారు.

**అమెరికా విడిచిపోవడానికి ముందే అరెస్ట్**

ఈ కుట్ర కొనసాగుతున్న సమయంలోనే అమెరికా దర్యాప్తు సంస్థలు అతనిపై నిఘా పెట్టాయి. జూలై 2024లో అమెరికా నుంచి వెళ్లేందుకు విమాన టికెట్లు బుక్ చేసుకున్న సమయంలో అతడిని అరెస్ట్ చేశారు. అమెరికా అటార్నీ జనరల్ పామెలా బాండీ మాట్లాడుతూ, అమెరికా నేలపైకి వచ్చి అధ్యక్షుడిని హత్య చేయాలని కుట్ర పన్నిన వ్యక్తిని చట్టం ముందు నిలబెట్టామని చెప్పారు. అమెరికా భద్రతకు ముప్పు కలిగించే చర్యలను ఏ విధంగానూ సహించబోమని హెచ్చరించారు. ఎఫ్‌బీఐ అధికారి జేమ్స్ బార్నకేల్ మాట్లాడుతూ ఈ కుట్ర అమెరికా ప్రజాస్వామ్యంపై దాడి చేయడానికే ప్రయత్నమని అన్నారు. ఇలాంటి అంతర్జాతీయ ఉగ్ర కుట్రలను అడ్డుకోవడంలో ఎఫ్‌బీఐ కట్టుదిట్టంగా పనిచేస్తుందని తెలిపారు.

**జీవితఖైదు వరకు శిక్ష అవకాశం**

మర్చంట్‌పై హత్యకు కాంట్రాక్ట్ ఇవ్వడం (మర్డర్ ఫర్ హైర్) మరియు అంతర్జాతీయ ఉగ్రవాదానికి సంబంధించిన నేరాలు నిరూపితమయ్యాయి. ఈ కేసులో అతనికి జీవితఖైదు వరకు శిక్ష పడే అవకాశం ఉంది. ఇదిలా ఉండగా పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతున్న సమయంలో ఈ తీర్పు వెలువడింది. అమెరికా--ఇజ్రాయెల్ దాడులకు ప్రతిగా ఇరాన్ ప్రతిస్పందిస్తున్న పరిస్థితుల్లో ప్రాంతీయ ఉద్రిక్తతలు పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో అమెరికా నాయకులపై కుట్ర కేసు అంతర్జాతీయ స్థాయిలో మరింత ప్రాధాన్యం సంతరించుకుంది.



## అంతర్జాతీయ మహిళ దినోత్సవం

- ఎంపీ డీకే అరుణ

**టీ మీడియా, మార్చి 7, వనపర్తి బ్యూరో :**

అంతర్జాతీయ మహిళ దినోత్సవం సందర్భంగా మహబూబ్ నగర్ జిల్లా కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో నిర్వహించిన చైల్డ్ మ్యారేజ్ ఫ్రీ భారత్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మహబూబ్ నగర్ ఎంపీ డీకే అరుణ.బాల్య వివాహాల నియంత్రణ పోస్టర్ ఆవిష్కరించారు.అనంతరం చైల్డ్ మ్యారేజ్ ఫ్రీ భారత్ కొరకు ప్రజలను చైతన్యం చేసేందుకు ఏర్పాటు చేసిన ప్రచార రథాన్ని జెండా ఊపి ప్రారంభించారు.అంతర్జాతీయ మహిళ దినోత్సవం శుభాకాంక్షలు తెలిపి వారు మాట్లాడుతూలైఫ్ లో సెటిల్ అయ్యాక పెళ్ళాలు చేసుకుంటే.ప్రతి మహిళకు ఆర్థిక స్వేచ్ఛ ఉంటుంది.మంచి ఉన్నతమైన చదువులు చదువుకుని గొప్ప స్థానాల్లో ఉండాలి.మహిళలు ఉన్నత విద్యాభ్యాసం చేయాలని అన్నారు.చిన్న తనంలో పెళ్లిళ్లు చేయడం ద్వారా జీవితంలో అనేక ఇబ్బందులు ఎదురవుతాయి.బాల్యం ఎంతో మధురమైనది.18 ఏళ్లు పై బడిన యువతులు.ఉన్నత చదువులు చదివి ఉద్యోగాలు సాధించాలి.ఆడపిల్లలను తల్లిదండ్రులు భారంగా భావించవద్దు. ఆడపిల్లలు ఇంటి మహాలక్ష్ములు గా భావించాలి.18 ఏళ్ల లోపు పిల్లలకు పెళ్లి చేసే తల్లిదండ్రుల ఆలోచన విధానం మారాలి. తల్లిదండ్రులకు అర్థం అయ్యే విధంగా వివరించాలి.విద్యార్థినులు అందరూ వివిధ రంగాలలో ఉన్నత స్థానంలో ఉండాలని కోరారు.



## బాధితులను పరామర్శించిన మల్లి బాబు యాదవ్

**టీ మీడియా, మార్చి 7 ,కామేపల్లి:**

కామేపల్లి మండలం రాయి గూడెం గ్రామానికి చెందిన సత్తి లింగమ్మ వృద్ధాప్య అనారోగ్య కారణాలతో ఇటీవల మరణించడం జరిగింది. శనివారం జరిగిన దశదిన కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్ పాల్గొని చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. సత్తి లింగమ్మ ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. కన్నతల్లి లేని లోటు ఆ కుటుంబానికి తీరని విషాదాన్ని మిగిల్చిందని విచారం వ్యక్తం చేశారు. ఇటువంటి సమయంలోనే ధైర్యం కోల్పోకూడదు అని, కొడుకులకు, కుటుంబానికి మనోధైర్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో రుకి తండా గ్రామపంచాయతీ సర్పంచ్ గుగులోతు రమాదేవి గుగులోతు రవి, ఉప సర్పంచ్ పరిమిశెట్టి సాంబయ్య, సత్తి సైదులు సత్తి లింగయ్య, సత్తి నరసయ్య సత్తి చిట్టిబాబు, చిన్న బోయిన సత్యం ఉబ్బని రాములు చిన్నబోయిన రామకృష్ణ, గుగులోతు మంగ, బాస్, శివుడు,గుగులోతు కిషన్, బిక్షం బాధావత్ నాగరాజు, తదితరులు పాల్గొన్నారు

## పరిసరాల పరిశుభ్రత మన అందరి బాధ్యత

- డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి
- రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు



**టీ మీడియా, మార్చి 7, వనపర్తి బ్యూరో :**

రాష్ట్ర ప్రజా ప్రభుత్వం 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా వనపర్తి డిగ్రీ కాలేజ్ లో పరిశుభ్రత కార్యక్రమంలో రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి పాల్గొన్నారు. డిగ్రీ కాలేజ్ ఆవరణలో చెత్తను శుభ్రం చేశారు. డిగ్రీ కాలేజ్ విద్యార్థులు ఎదుర్కొంటున్న బస్సు సౌకర్యాన్ని సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని కోరారు. డిగ్రీ కాలేజ్ విద్యార్థులకు హాస్టల్ వసతులు కావాలని వైస్ ఛాన్సలర్ తో మాట్లాడి నిధులు కేటాయించాలని కోరగా వారు సానుకూలంగా స్పందించారు.చిన్నారెడ్డి మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత చాలా ముఖ్యమని పరిశుభ్రత ఉంటే మనం ఆరోగ్యంగా ఉంటామని అన్నారు.పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం మన బాధ్యత అని చెత్తను చెత్త కుండీలో వేసి, పరిసరాలను శుభ్రంగా ఉంచు కోవాలని . పరిసరాలలో నీరు నిల్వ ఉండకుండా చూసుకుంటే మలేరియా, డెంగీ వంటి వ్యాధులు రాకుండా కాపాడుకునే వాళ్లం అవుతామని అన్నారు.గ్రామాలలో పరిసరాల పరిశుభ్రత చాలా ముఖ్యమని విద్యార్థులు గ్రామ ప్రజలకు వివరించాలని అన్నారు.ప్రజా ప్రభుత్వం 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో అందరూ పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.కార్యక్రమంలో టిపిసిసి ప్రధాన కార్యదర్శి నందిమల్ల యాదయ్య, వనపర్తి జిల్లా ఏఐపిసి అధ్యక్షులు నాగార్జున,వనపర్తి పట్టణ ప్రధాన కార్యదర్శి బాబా, ఎత్తం చరణ్ రాజ్, సీనియర్ నాయకులు రామ్ జి నాయక్, సురేష్, బాల్ రాజు, పాషా , విద్యార్థులు పాల్గొన్నారు.

## సెల్ఫ్ గవర్నమెంట్

- హాజజరైన మంత్రి జూపల్లి కృష్ణారావు



**టీ మీడియా , మార్చి 7, కొల్లాపూర్**

కొల్లాపూర్ మండల్ కుడికిల్ల గ్రామంలోనిప్రైమరీ స్కూల్ విద్యార్థిని విద్యార్థులు అలాగే, ప్రధానోపాధ్యాయుడు ఉపాధ్యాయ బృందం సెల్ఫ్ గవర్నమెంట్ డే ను ఘనంగా నిర్వహించారు, ఈ సందర్భంగా జూపల్లి రఘుపతిరావుగారు మాట్లాడుతూమన గ్రామంలోని ప్రైమరీ స్కూల్ లోను ఉన్నటువంటి ఉపాధ్యాయులు మన పిల్లలకు దొరకడం వారి అదృష్టమని ఈ సందర్భంగా చెప్పారు అలాగే ప్రవేట్ స్కూల్ లకు దీటుగా అన్ని వసతులతో మన గ్రామ స్కూల్ను రాష్ట్ర మంత్రి జూపల్లి సహాయ సహకారంతో అద్భుతంగా తీర్చిదినం, అలాగే పిల్లలు మంచిగా చదువుకొని మన గ్రామానికి తల్లిదండ్రులకు ఉపాధ్యాయుని ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలని ఈ సందర్భంగా తెలియజేశారు అలాగే బడికి సంబంధించి ఏలాంటి సహాయం చేయడానికి అయినా వినకడుగు వేయమని ఈ సందర్భంగా తెలియజేశారు, తదనంతరం విద్యార్థినిలకు బహుమతులను అందజేశారు ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు చెన్నయ్య సార్ చందు సార్ రబ్బాని సార్ గారు, గ్రామ ఉపసర్పంచ్ మల్లేష్ యాదవ్ మేడమ్స్ పేరెంట్స్ తదితరులు.

## వార్డు అభివృద్ధి పథంలో నడుస్తానన్నా కౌన్సిలర్ వంగ అనూష రాజశేఖర్ గౌడ్



**టీ మీడియా, మార్చి 7, కొల్లాపూర్ :**

13వ వార్డు (చౌటబెట్ల) గ్రామంలో విద్యుత్ సమస్యల మీద గ్రామం మొత్తం తిరుగుతూ ఏపాడైపోయిన స్తంభాల స్థానంలో కొత్త స్తంభాలు వేయాలని అదేవిధంగా కరెంటు తీగల పైన ఉన్న చెట్ల కొమ్మలను కూడా తొలగించాలని మరియు కొన్ని వీధుల్లో కొత్త స్తంభాలు అవసరం ఉన్నాయి కావున అవి కూడా త్వరగా పూర్తి చేయాలని విద్యుత్ ఏఈ గారికి కౌన్సిలర్ వివరించారు. ప్రజలకు విద్యుత్ సమస్యలు రాకుండా ఉండే విధంగా చూస్తానని కౌన్సిలర్ వంగ అనూష రాజశేఖర్ గౌడు తెలియజేశారు ప్రజలు నన్ను నమ్మి అఖండ మెజారిటీతో గెలిపించడం జరిగింది. కావున వార్డు ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ మీరిచ్చిన అవకాశాన్ని బరువుగా కాకుండా బాధ్యతగా తీసుకొని పనిచేస్తానని అదేవిధంగా ఎల్లప్పుడూ వార్డు ప్రజల శ్రేయస్సు కొరకు పనిచేస్తానని హామీ ఇస్తున్నాను ఈ కార్యక్రమంలో విద్యుత్ అధికారులు మరియు గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## గణపతి లొంగిపోతే.. రక్షణ కల్పిస్తాం

సుమతిని సీఎం రేవంత్‌రెడ్డి అభినందించారు. లొంగిపోయిన వారిలో తెలుగు రాష్ట్రాలకు చెందిన చలసాని నవత, ఉత్తిమి అనిల్ కుమార్, కాశిపోగు భవాని, బడిసె ఉంగయ్య, మడవి ఆదిమె ఉన్నారు. మిగిలిని వారు చత్తీస్ఘడ్ రాష్ట్రానికి చెందిన వారున్నారు.

### మంచి జీవితం గడిపేలా కృషి

భారీ సంఖ్యలో మావోయిస్టులు లొంగిపోయేలా పోలీసులు కృషి చేశారని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. పోలీసులు నక్సలైట్లలో ఒక నమ్మకాన్ని కల్పించారని, లొంగిపోయిన వాళ్లు మంచి జీవితం గడిపేలా ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. అహింసా పద్ధతిలోనే బ్రిటీషర్లపై పోరాడి స్వాతంత్ర్యం తెచ్చుకున్న చరిత్ర మనదని, హింస, ఆయుధాలతో పోరాటం ఒక్కటే పరిష్కారం కాదని గాంధీ చాటి చెప్పారని అన్నారు. అణ్వాయుధాలు ఉన్న దేశాలు కూడా ఇవాళ చర్చల ద్వారా సమస్య పరిష్కరించుకుంటున్నాయని, ఇంకా అజ్ఞాతంలో ఉన్న నక్సలైట్లకు విజ్ఞప్తి చేస్తున్నానని, ప్రజలతో మమేకమై కలిసి ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలని కోరారు.అమిత్ షా సూచించారు : దేవ్‌జీ, ఆయన మిత్రబృందం కొన్ని ప్రతిపాదనలు చేశారన్న సీఎం తమ సమస్యలు పరిష్కరిస్తే లొంగిపోతామని చెప్పారుని గుర్తు చేశారు. రాష్ట్ర స్థాయిలో మేం చేయగలిగింది చేస్తామని నక్సలైట్ నేతలతో చెప్పానని, నక్సలైట్ నేతల డిమాండ్లను కేంద్రహోంమంత్రితో చర్చించానని, లొంగిపోయిన వారి మెరుగైన జీవితానికి హామీ ఇవ్వాలని అమిత్ షా సూచించారని అన్నారు. అమిత్ షాతో చర్చల తర్వాత నక్సలైట్ నేతలతో మళ్లీ చర్చించానని, కేంద్రహోంమంత్రితో చర్చల సందేశాన్ని నక్సలైట్ నేతలకు వివరించానని, తమ చర్చల అనంతరం ఒకేసారి 130 మంది మావోయిస్టులు లొంగిపోయారని అన్నారు. ఒకేసారి ఇంతమంది మావోయిస్టులు ఏ రాష్ట్రంలోనూ లొంగిపోలేదని, ఇప్పటివరకు తెలంగాణలో 700 మంది మావోయిస్టులు లొంగిపోయారని వివరించారు.

### హోదాలను బట్టి ప్యాకేజీ కల్పిస్తాం

లొంగిపోయిన మావోయిస్టులకు పునరావాస ప్యాకేజీతో పాటు ఆరోగ్య భద్రత కార్డు కల్పిస్తామన్న రేవంత్ రెడ్డి నిమ్స్ వంటి ఆస్పత్రుల్లో మెరుగైన వైద్య సేవలు పొందే ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. మావోయిస్టుల హోదాలను బట్టి ప్యాకేజీ కల్పిస్తామని చెప్తున్నామని, ఇంటి స్థలం, ఇందిరమ్మ ఇల్లు ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. రాష్ట్రంలో భూమి లభ్యత కష్టంగా ఉన్నందున సాగుభూమి ఇవ్వటంపై హామీ ఇవ్వలేనని, రాష్ట్రంలో హింసకు తావులేదని, అక్రమంగా ఆయుధాలు కలిగి ఉంటే సహించేది లేదని పేర్కొన్నారు.

### రాజకీయాల్లోకి రావచ్చు

ఎత్తివేయగలిగే కేసులుంటే ప్రభుత్వం సానుకూలంగా ఉందని, కేసులు ఎత్తివేయడానికి ఉన్న అవకాశాలను పరిశీలిస్తామని, చట్టపరంగా ఎత్తివేయడానికి అవకాశమున్న కేసులను ఎత్తివేస్తామని రేవంత్ రెడ్డి తెలిపారు. తీవ్రమైన నేరాలు ఉంటే ప్రభుత్వాలు ఎత్తివేస్తే కోర్టులు ఊరుకోవని అన్నారు. వ్యక్తులు, వారిపై ఉన్న నేరాల తీవ్రతనుబట్టి పరిశీలిస్తామని, సాధారణ వ్యక్తుల చేతిలో ఆయుధాలు వద్దనేది ప్రభుత్వ పాలసీ అని, లొంగిపోయిన వాళ్లు రాజకీయాల్లోకి వస్తామన్నా స్వాగతిస్తామని తెలిపారు. కొందరు ఇప్పటికే రాజకీయాల్లోకి వచ్చి ప్రజాప్రతినిధులు అయ్యారని, సీతక్కలాంటి వాళ్లు రాష్ట్రమంత్రి కూడా అయ్యారని గుర్తు చేశారు. కాంగ్రెస్‌లోకి వచ్చేవాళ్లు పీసీసీని కలిసి ఆసక్తి తెలియజేయవచ్చని అన్నారు.


## అంతర్జాతీయ మహిళా దినోత్సవం : చరిత్ర

**టి మీడియా ,మార్చి 7 , ఢిల్లీ బ్యూరో :**




అంతర్జాతీయ మహిళా దినోత్సవం ప్రతీ సంవత్సరం మార్చి 8న జరుపుతారు. ఈ దినోత్సవాన్ని మొదట అంతర్జాతీయ మహిళా శ్రామిక దినోత్సవంగా పిలిచేవారు. వివిధ ప్రాంతాలలో ఈ ఆచరణ మహిళలకు గౌరవం, గుర్తింపు నిస్తోంది. ప్రేమల గురించిన సాధారణ ఉత్సవం నుండి మహిళల ఆర్థిక, రాజకీయ, సామాజిక సాధనల ఉత్సవంగా వుంటుంది. సామ్యవాద రాజకీయ ఘటనగా ప్రారంభమై, వివిధ దేశాల్లో, ముఖ్యంగా తూర్పు ఐరోపా, రష్యా, పూర్వ సొవియట్ సమూహపు దేశాల సంస్కృతుల్లో భాగమైంది. ఇంకొన్ని ప్రాంతాలలో ఐక్యరాజ్యసమితి ఉద్దేశించిన విధంగా రాజకీయ, మానవీయ హక్కులు బలంగా వుండి ప్రపంచవ్యాప్తంగా మహిళల రాజకీయ, సామాజికహక్కుల పోరాటంపై జాగృతి పెంచే విధంగా జరుపుతారు. ఈ రోజున కొంతమంది వంకాయ రంగు రిబ్బనులు ధరిస్తారు.

**చరిత్ర...**




ప్రారంభంలో మహిళా దినోత్సవం వేరు వేరు తేదీలలో ఆచరించబడింది. చికాగోలో 1908 మే 3, న్యూయార్క్లో 1909 ఫిబ్రవరి 28న జరిగాయి. 1910 ఫిబ్రవరి 27రెండవ అంతర్జాతీయ సామ్యవాద సమావేశానికి ముందుగా 1910 ఆగస్టులో అంతర్జాతీయ మహిళా సమావేశం కోపెనహాగెన్ లో జరిగింది. అమెరికా సామ్యవాదులచే ఉత్తేజితులై, జర్మన్ సామ్యవాది లూయిస్ జియట్జ్ వార్షిక అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరపాలని ప్రతిపాదించగా సహ జర్మన్ సామ్యవాది క్లారా జెట్కిన్ సమర్థించారు .17 దేశాలనుండి వచ్చిన 100 మహిళలు మహిళలకు ఓటుహక్కుతో పాటు సమానహక్కులు సాధించడానికి సరియైన వ్యూహమని అంగీకరించారు.తదుపరి సంవత్సరం 1911 మార్చి 19న పదిలక్షలమంది పైగా ఆస్ట్రియా, డెన్మార్క్, జర్మనీ, స్విట్జర్లాండ్ దేశాలలో 1911 మార్చి 19 న మహిళా దినోత్సవం ఆచరించారు. ఆస్ట్రో-హంగేరియన్ రాజ్యంలో300 పైగా ప్రదర్శనలు జరిగినవి. వియన్నాలో రింగ్ స్ట్రాసెలో ప్రదర్శన చేశారు మహిళలు ఓటుహక్కు, ప్రభుత్వ పదవుల హక్కు అడిగారు. ఉపాధిలో లింగ విచక్షణ పద్ధతులను ప్రతిఘటించారు..అమెరికాలో ఫిబ్రవరి చివరి ఆదివారం నాడు మహిళా దినోత్సవం జరుపుకుంటూనే ఉన్నారు.ఆస్ట్రియా లోని,బిల్డర్స్ లేబరెర్స్ ఫెడరేష మహిళా సభ్యులు **అంతర్జాతీయ మహిళా దినోత్సవం 1975 నాడు ర్యాలీ**

1913 లో రష్యను మహిళలు వారి మొదటి మహిళా దినోత్సవాన్ని ఫిబ్రవరి చివరి ఆదివారం జరుపుకున్నారు. (అప్పటికి రష్యాలో జూలియన్ కాలెండర్ అమలులో ఉంది.1914 వరకు మహిళా సమస్యల గురించి ఎన్నో ఆందోళనలు జరిగినా అవేవీ మార్చి 8న జరగలేదు. అయితే 1914 నుండి ఆ రోజుని మహిళా దినోత్సవంగా ప్రకటించుకున్నారు. ఆ రోజు ఆదివారం కావడం వలన అలా ప్రకటించివుండవచ్చు కానీ, అప్పటినుండే అన్నీ దేశాల్లోనూ మార్చి 8 నే మహిళా దినోత్సవంగా తీర్మానించారు .1914 లో జర్మనీ జరుపుకున్న మహిళా దినోత్సవాన్ని మహిళా ఓటు హక్కు కోసం అంకితమిచ్చారు. అయితే,1918 గానీ వారికి ఓటు హక్కు రాలేదు.ౕ 1917 లో ఫిబ్రవరి విప్లవం ఆ నెల చివరి ఆదివారం, మార్చి 8న సెయింట్ పీటర్స్ బర్గ్లో మహిళా దినోత్సవం జరుపుకోవడంతో మొదలయ్యింది. ఆ రోజు సెయింట్ పీటర్ బర్గ్ మహిళలందరూ మొదటి ప్రపంచ యుద్ధం, రష్యాలోని ఆహార కొరత ముగిసిపోవాలని నినదించారు. దీన్నే 'బ్రెడ్డు, శాంతి' డిమాండుగా వ్యవహరించారు.లియోన్ ట్రోస్కీ ప్రకారం, 'ఆ రోజే ఒక విప్లవానికి పునాదులు పడతాయని ఎవరూ ఊహించలేదు. వస్త్ర పరిశ్రమల్లోని మహిళా శ్రామికులందరూ పై అధికారుల హెచ్చరికల్ని ఖాతరు చేయకుండా విధులు బహిష్కరించి వీధుల్లో పడ్డారు.

### అవే విప్లవానికి తొలి అడుగులు

అక్టోబర్ విప్లవం తరువాత సోవియట్ యూనియన్లో ఆ రోజుని అధికారిక సెలవు దినంలా ప్రకటించడానికి బోల్షెవిక్ అలెగ్జాండర్ కొలెన్టైల్ లు, వ్లాదిమిర్ లెనిన్ని ఒప్పించడంలో కృతకృత్యులయ్యారు. కానీ, 1965 వరకూ అది అమల్లోకి రాలేదు. అదే సంవత్సరం సోవియట్ మహిళలు అప్పటి వరకు చూపిన సాధికారత స్మారకార్థం, మార్చి 8న యుయస్సార్ ప్రభుత్వం ఆ దినాన్ని అధికారక సెలవు దినంగా ప్రకటించింది.1917 సోవియట్ విప్లవం తరువాత రష్యా కూడా దీనిని ప్రకటిచింది. చాలా మటుకు కమ్యూనిస్టు, సోషలిస్టు దేశాల్లో దీన్ని పాటించేవారు. 1922 నుంచి చైనావారు, 1936 నుంచి స్పానిష్ వారు దీనిని అధికారికంగా ప్రకటించుకున్నారు1949 అక్టోబర్ 1 లో చైనా పీపుల్స్ రిపబ్లిక్ ఏర్పడినది. వారి రాష్ట్రీయ మండలి డిసెంబరు 23న, మార్చి ఎనిమిదిని అధికారిక దినంగా ఉత్తర్వులిస్తూ, చైనా మహిళలకి ఆ రోజు సగం సెలవు ప్రకటించింది.అప్రాచ్య దేశాల్లో1977 తరువాత అంతర్జాతీయ మహిళా దినోత్సవం బహుళ ప్రాముఖ్యత సంతరించుకుంది. అప్పుడు మార్చి 8ని మహిళా హక్కులు, ప్రపంచ శాంతి దినంగా ప్రకటించాలని యునైటెడ్ నేషన్స్ జనరల్ అసెంబ్లీ పిలుపునిచ్చింది.

### భారతదేశంలో మహిళా హక్కుల పోరాటం

భారతదేశంలో తొలిగా అహ్మదాబాద్ లో అనసూయా సారాభాయ్ టెక్స్‌టైల్ లేబర్ అసోసియేషన్ అనే పేరుతో కార్మికసంఘం ప్రారంభించింది. భారత కార్మికోద్యమంలో కార్మిక స్త్రీలను సంఘటితం చేసిన మహిళా నేతలలో సుశీలా గోపాలన్ విమలారణదివే, కెప్టెన్‌లక్ష్మిసెహగల్, అహల్యారంగ్నేకర్, పార్వతీకృష్ణన్ ప్రముఖులు. ఈ పోరాటాల ఫలితంగానే స్వాతంత్ర్యం తరువాత కార్మికుల బ్రతుకులు మెరుగయ్యాయి. కార్మికుల పని పరిస్థితులు, వేతనాలు, మహిళా కార్మికుల గురించి చట్టాలను చేయబడినవి. 1991లో ప్రారంభమైన సరళీకరణ విధానాల ప్రభావంవలన ప్రైవేటు రంగం బలపడడంతో మహిళా కార్మికుల చట్టాల అమలు కుంటుబడుతున్నది. దీనికి వ్యతిరేకంగా పోరాటాలలో మహిళలు పాల్గొనడం, నేతృత్వం వహించడం మెరుగుపడవలసివుంది.

### యు.యెస్.ఎ లో అధికారిక గుర్తింపు

మానవహక్కుల ఉద్యమకారిణి, నటి బేతా పోజ్నియక్ మహిళా దినోత్సవంగా అధికారిక గుర్తింపును, ప్రభుత్వ సెలవుదినాన్ని సాధించేందుకు లాస్ ఏంజిల్స్ నగరానికి మేయరు, కాలిఫోర్నియా రాష్ట్ర గవర్నర్, యునైటెడ్ స్టేట్స్ కాంగ్రెస్ సభ్యులతో కలిసి కృషిచేశారు. 1994లో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా గుర్తించేలా బిల్లును రూపొందించడం ద్వారా సాకారం చేశారు.

## కమర్షియల్ సిలిండర్ల నిలిపివేత

- హోటళ్లు, రెస్టారెంట్ల పరిస్థితేంటి ..?
- రాష్ట్రంలో నెలకు 7-7.5 లక్షలరీఫిల్‌కు డిమాండ్

**టి మీడియా ,మార్చి 7 , హైదరాబాద్ బ్యూరో :**

కట్టెల పొయ్యిలో వంటలు చేసే రోజులు గుర్తున్నాయా? ఇలా వంటలు చేస్తారనే విషయం ఇప్పటి తరానికి తెలియకపోవచ్చు. అయితే ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్న యుద్ధాల కారణంగానే నేడు ఇలాంటి పరిస్థితులు వచ్చేట్లు కనిపిస్తోంది. దీనికి అనుగుణంగానే పారిశ్రామిక, వాణిజ్య వినియోగదారులకు ఎల్పీజీ సరఫరా నిలిపివేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నేపథ్యంలో రెస్టారెంట్లు, హోటళ్లపై తీవ్ర ప్రభావం పడే అవకాశం కనిపిస్తోంది.

### 10 రోజుకు సరిపడ గ్యాస్ నిల్వలు

తెలంగాణ వ్యాప్తంగా సగటున నెలకు సుమారు 7 నుంచి 7.5 లక్షల వాణిజ్య సిలిండర్ల రీఫిల్?కు డిమాండ్? ఉంది. అయితే యుద్ధం కారణంగా విదేశాల నుంచి భారత్?కు రావాల్సిన గ్యాస్? సరఫరా నిలిచిపోయింది. ప్రైవేట్? డీలర్ల వద్ద స్టోరేజీ సామర్థ్యం సుమారు రెండు, మూడు రోజులకే ఉండటం కారణంగా గ్యాస్? నిల్వలు ఇప్పటికే సున్నాకు చేరినట్లు తెలిసింది. ప్రభుత్వ చమురు సంస్థల వద్ద 8 నుంచి 10 రోజుల వరకు సరిపడ గ్యాస్? నిల్వకు స్టోరేజీ కెపాసిటీ ఉండటంతో ప్రస్తుతానకి గ్యాస్ సరఫరాను కొనసాగిస్తూ వచ్చాయి. అయితే శుక్రవారం నాడు కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం నిల్వ ఉన్న గ్యాస్?ను గృహావసరాలకే ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశాలు జారీ చేసింది. దీంతో తాత్కాలికంగా వాణిజ్య సిండర్ల సరఫరా నిలిచిపోయింది.

### అత్యవసర సేవలకు మాత్రమే సరఫరా

తాజాగా ప్రపంచ వ్యాప్తంగా నెలకొన్న పరిస్థితుల కారణంగా దేశంలో గ్యాస్ నిల్వలు అడుగంటుతున్నాయని తెలంగాణ ఎల్పీజీ డిస్ట్రిబ్యూటర్ల సంఘం అధ్యక్షుడు కె. జగన్మోహన్?రెడ్డి తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం ఉన్న గ్యాస్? నిల్వలను ఆసుపత్రులు, హాస్టళ్లు వంటి అత్యవసర సేవలకు మాత్రమే ప్రాధాన్యం ఇవ్వాలని ప్రభుత్వం యోచిస్తోందని అన్నారు. రెస్టారెంట్లు, హోటళ్లకు తాత్కాలికంగా సరఫరా చేయకూడదని నిర్ణయించినట్లు చెప్పారు. ఇప్పటికే డీలర్ల దగ్గర ఉన్న వాణిజ్య సిలిండర్లను ఆసుపత్రులు, హోటళ్ల సరఫరాకు ప్రాధాన్యమివ్వనున్నట్లు వెల్లడించారు. అయితే కళాశాలలు, పాఠశాలలు, యూనివర్సిటీలు, హాస్టళ్లు, అన్నదాన సత్రాలలో గ్యాస్? వినియోగం ఎక్కువగా ఉంటుంది. అక్కడ గ్యాస్? అయిపోతే పరిస్థితి ఏమిటనే సందేహాలు నెలకొన్నాయి.

### అత్యవసర సేవలకు మాత్రమే సరఫరా

ఇంకోవైపు గృహావసరాల్లోనూ నిబంధనల్ని ఇక పక్కాగా అమలు చేయాలని డీలర్ల సంఘం నిర్ణయించింది. వినియోగదారుడు ఓటీపీ చెబితేనే సిలిండర్? ఇవ్వాలని నిబంధనలను కఠినంగా అమలు చేయబోతోంది. ఈ-కేవైసీ పూర్తి చేసుకున్నవారికే సరఫరా చేయాలని డెలివరీ బాయ్?లకు సూచించింది.

### ప్రత్యామ్నాయాలు వాడండి

ప్రస్తుతం అందుబాటులో ఉన్న గ్యాస్?ను పొదుపుగా వినియోగించాలని జగన్మోహన్?రెడ్డి వినియోగదారులకు విజ్ఞప్తి చేశారు. 30 రోజులకు రావాల్సిన సిలిండర్?ను 40 రోజులు వినియోగించేలా జాగ్రత్తలు వహించాలని అన్నారు. రెస్టారెంట్లు, హోటళ్ల వారు అవసరమైతే కట్టెలు, డీజిల్? లేదా విద్యుత్? వంటి ప్రత్యామ్నాయాలు వినియోగించాలని ఆయన సూచించారు. తాజాగా ప్రపంచ వ్యాప్తంగా నెలకొన్న పరిస్థితుల కారణంగా దేశంలో గ్యాస్ నిల్వలు అడుగంటుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రస్తుతం ఉన్న గ్యాస్? నిల్వలను ఆసుపత్రులు, హాస్టళ్లు వంటి అత్యవసర సేవలకు మాత్రమే ప్రాధాన్యం ఇవ్వాలని ప్రభుత్వం యోచిస్తోంది. రెస్టారెంట్లు, హోటళ్లకు తాత్కాలికంగా సరఫరా చేయకూడదని నిర్ణయించింది. ఇప్పటికే డీలర్ల దగ్గర ఉన్న వాణిజ్య సిలిండర్లను ఆసుపత్రులు, హోటళ్ల సరఫరాకు ప్రాధాన్యమివ్వనున్నాం." - కె.జగన్మోహన్?రెడ్డి, తెలంగాణ ఎల్పీజీ డిస్ట్రిబ్యూటర్ల సంఘం అధ్యక్షుడు